# పరుదాటాక...



హరి మోహన కృష్ణ

కదులుతున్న కొబ్బరాకుల మధ్యనుండీ చల్లగా కురుస్తున్న పండు వెన్నెలలో ఆరుబయట మడతమంచంమీద వెల్లకిలా పడుకుని, నిండు చంద్రుడిని తదేకంగా చూస్తున్నాడు రాంబాబు భాగ్యనగరం శివార్లలో వున్నా, హడావిడి సోకని బ్యాంక్ కాలనీ అది నాలుగైదు వరుసలుగా ఇళ్ళు కట్టబడివున్నాయి అక్కడి నుండీ ఫర్లాంగు దూరంలో వున్న మెయిన్‌రోడ్డును కలుపుతూ మట్టిరోడ్డు వేయడంతో, ఇప్పుడిప్పుడే చుట్టూవున్న బంజరుభూముల్లో అక్కడక్కడ యిళ్ళు కడుతున్నారు సిటీలో దొరకని చల్లగాలిని ఏకాంతంగా అనుభవిస్తున్న రాంబాబు, వారం రోజులక్రితం పుట్టింటికి వెళ్ళిన అర్ధాంగి గురించి ఆలోచిస్తున్నాడు. కొత్తగా పెళ్ళయిన జంటని సంక్రాంతి పండక్కి రమ్మని, మావగారు ఉత్తరం వ్రాయడంతో, అప్పటికే తల్లిమీద బెంగపడిన భార్యని ముందుగా పంపించాడు.

"ఏంటి గురుగారూ అప్పుడే పడకేశారు?" భోంచేసి లేచినట్టున్నాడు, వక్కపొడి నోట్లో వేసుకుంటూ అడిగాడు పక్కింట్లోంచి అప్పారావు. ఆ పరిస్థితిలో ఆయనకు సమాధానం చెప్పి, గతంలో తను బలైపోయిన విషయాలు గుర్తొచ్చి, చటుక్కున కళ్ళు మూసుకుని కదలకుండా పడుకున్నాడు. "ఏంటోయ్! నీకు ముగ్గులిట్టం గూడా వచ్చా?" నీళ్ళబకెట్ మోసుకొచ్చి గేటుదగ్గర పెడుతున్న శంకర్రావుని పలకరించాడు అప్పారావు

"లేదుసార్, మా ఆడోళ్ళకి జస్ట్..... హెల్పింగ్.. ." అంటూ చేతులు నలుపుకుంటూ ప్రహరీగోడ దగ్గరకు వస్తున్న శంకర్రావుని కనుకొనల నుంచే జాలిగా చూస్తున్నాడు రాంబాబు ఆ వీధిలో ఆడపిల్లలు ఎక్కువగా వుండడంతో, పోటీలుపడి మరీ వేస్తున్నారు సంక్రాంతి ముగ్గులు. రాత్రిపూటే కళ్ళాపుజల్లి అట్టేపెట్టుకుని, పొద్దున్నే నాలుగ్గంటలకే లేచి ముగ్గేయడం మొదలెడితే, రంగులూ, పూలూ అన్నీ వేసేసరికి ఆరవుతుంది.

చల్లగాలి నెమ్మదిగా చలిగాలిగా మారుతోందని గమనించి, పైగా ఒంటిమీద ఒక్క లుంగీ తప్ప మరే ఆచ్ఛాదనా లేకపోవడంతో, లేచి లోపలికెళ్ళి దుప్పటి తెచ్చుకోవాలా, లేక ఏకంగా లోపలికి వెళ్ళి పడుకుందామా అని బద్ధకంగా ఆలోచిస్తూ అలాగే నిద్రలోకి జారిపోయాడు రాంబాబు.

ఒక్క ఊపులో లేచి నుంచున్నాడు రాంబాబు గాఢ నిద్రలోంచి ఒక్కసారిగా మెలకువరావడంతో, తనెక్కడున్నానా అని ఆలోచించే వ్యవధిలేకుండానే చోర్. . పకడో అన్న కేక మరోసారి వినిపించింది కనురెప్పలు అతుక్కుపోయినట్టు, ఎంత ప్రయత్నించినా తెరుపుపడక, చుట్టూవున్న పరిసరాలు రెప్పల సందులనించే అస్పష్టంగా కనిపిస్తున్నాయి పూర్తి నిద్రకీ, పూర్తి మెలకువకీ సరిగ్గా మధ్యస్థితిలో వున్నాడతను దరిచేరని సముద్రపు అలలమధ్య తన శరీరం తేలుతున్నట్టుగా అనిపిస్తోంది మంచంమీద కూలబడి, కళ్ళు నలుపుకుంటుండగా, వెనకపక్కగా దబ్బుమని లేత కొబ్బరిబోండం రాలినట్టుగా చప్పుడైంది. రాంబాబు ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూశాడు.

ఎత్తయిన తెల్లని గోడపక్కగా లేచి నిలబడుతున్నదో నల్లని ఆకారం "దొంగ.... దొంగ..... పట్టుకోండి" కేకలు వినిపిస్తుండగా తనవైపుకు దూసుకువస్తున్న వ్యక్తిని అయోమయంగా చూస్తూ చేతులు సాచాడు తనని దాటుకునిపోయినవాణ్ణి అందుకోవడానికి అదేవైపుకి పరుగెత్తి, వీధిలోకి వచ్చాడు రాంబాబు తెల్లని ట్యూబ్‌లైట్ల కాంతిలో పట్టపగల్లా కనిపిస్తున్న ఆ నిశ్శబ్దవీధిలో దూరంగా పరిగెడుతున్న ఆకారం వైపుకు దూసుకుపోయాడు వేగంగా

అదేసమయంలో బైటకువచ్చిన మరికొందరు హడావుడిగా అటువైపుకు పరుగెత్తారు. ఇళ్ళలో వున్న ఆడవాళ్ళు చకచకా లైట్లన్నీవేసి ఆ కాలనీని కాంతిమయం చేశారు. ముందు బయటకు రావడానికి జంకినా, కిటికీలోంచి నలుగురినీ చూసి ధైర్యం తెచ్చుకొని అప్పారావు లాంటి ఒక రిద్దరు, లుంగీలు సర్దుకుంటూ వీధిలోకి వచ్చారు.

"మూర్తిగారింట్లో దొంగలు పడ్డారు. ఒక డిటు పరిగెత్తాడు" గాబరాగా చెబుతున్నా రెవరో.

ఆయాసంతో, ఆవేశంతో పరిగెడుతున్న రాంబాబు, తన పరుగులో, తన కదలికల్లో ఏదో లోపం– ఏదో అసహజత్వం అనిపించింది. అదేమిటో తెలుసుకున్న ఉత్తర క్షణంలో, తన వెనక పరుగెత్తుకువస్తున్న మిగతా జనాన్ని గమనించాడు. అప్పటికే అతను వీధి దాటి బంజరుభూముల్లోకి వచ్చేశాడు. ఏం చేయాలో పాలుపోని ఆసమయంలో, అనాలోచితంగా దగ్గరలో వున్న . పెద్దసైజు కొండరాయి చాటుకు పరిగెత్తాడు. దొంగని పట్టుకోవడానికికాదు, తన నగ్నత్వాన్ని దాచుకోవడానికి. ముందుకు పరిగెత్తుకుపోయిన జనం కాలనీ చివరవున్న ఖాళీస్థలాల్లో దొంగ ఎటువైపు వెళ్ళివుంటాడా అని వెదుకుతుంటే, బండరాయి చాటుకు చేరిన రాంబాబు తన లుంగీ ఎక్కడ జారిపోయిందా అని కళ్ళు చిట్లించి, నేలమీద వెదుకుతున్నాడు ఆ చుట్టుపక్కల డొంకల్లో కాసేపు గాలించి, వెనక్కి తిరిగివచ్చిన వాళ్ళు పూర్తిగా కాలనీలోకి వెళ్ళిపోయేదాకా ఊపిరి బిగబట్టి కూర్చున్న రాంబాబు మెల్లగా యివతలికివచ్చి హడావుడిగా యిందాక తను పరిగెత్తిన ప్రదేశంలో వెతకడం మొదలెట్టాడు. అదృష్టవశాత్తు పౌర్ణమిరోజు కావడంతో, నేలంతా స్పష్టంగా కనిపిస్తోంది.

రాత్రంతా కురిసిన మంచువల్ల కాబోలు తివాసిలా పరుచుకున్న పచ్చగడ్డి తడితడిగా తగులుతోంది చేతులకి. కళ్ళు బాగా చీకటికి అలవాటుపడటంతో, మధ్యమధ్య తలెత్తి చుట్టూ చూసుకుంటున్నాడు తన నెవరన్నా గమనిస్తున్నారేమోనని. చల్లటి గాలితెమ్మెర తన శరీరాన్ని స్పృశిస్తూ వెళ్ళిపోతుంటే, చక్కిలిగింతగా ఫీలయి తల పైకెత్తి ఆకాశంలోకి చూశాడు రాత్రి పడుకోబోయేముందు నడినెత్తిన వున్న చంద్రుడు బాగా క్రిందకు దిగిపోయి దూరంగా కనిపిస్తున్న చెట్ల తోపుల మధ్యకి పారిపోతున్నట్టుగా, జారిపోతున్నాడు. అనుమానం వచ్చినచోటల్లా వంగి తడిమి చూసుకుంటూ, కాలనీవైపుకి వెడుతున్న రాంబాబుకి, ఆరుబైట నగ్నంగా తిరగడం కొద్దిగా అలవాటయి, ఒక్కింత నిటారుగా నిలబడగలుగుతున్నాడు. వీధి చివరగా చీకట్లో నిలబడి రోడ్డునంతా ఆత్రంగా పరిశీలిస్తున్న రాంబాబుకి, వీధి మధ్యలో చేరి పెద్దగా చర్చించుకుంటున్న చుట్టుపక్కలవారి మాటలు అస్పష్టంగా వినిపిస్తున్నాయి కేకలు విని కాబోలు పక్కలైనులోంచి వచ్చిన కొందరికి, దొంగలు వచ్చిన వైనాన్ని కళ్ళకుకట్టినట్టు వివరిస్తున్నారు ఒక రిద్దరు ఉత్సాహవంతులు. ఆ పరిసరప్రాంతాల్లో ఎక్కడా తన లుంగీ లేదన్న నిజాన్ని మెల్లమెల్లగా జీర్ణంచేసుకుంటున్న రాంబాబుకి ఒక్కసారిగా నిస్సత్తువ ఆవరించినట్లయింది. అంత చలిలో గూడా, నుదిటికి పట్టిన చెమట కణతలమీదుగా కారుతోంది తన పరిస్థితికి పొట్ట చెక్కలయ్యేలా నవ్వాలో, సిగ్గుతో కుంచించుకుపోయి బావురుమని ఏడవాలో తెలియని సందిగ్ధావస్థలో వున్నాడతను. ఆదమరచి నిద్రపోతున్న తనకు, ఎక్కడో ఏదో కేకలాంటిది వినబడటం, అసంకల్పిత ప్రతీకార చర్యలా తను త్రుళ్ళిపడిలేవడం, చివరికి యిలా ఒంటరిగా చీకట్లో, ఆరుబయట దిగంబరంగా దేవులాడటం అంతా ఒక కలలా జరిగి పోయింది.

ఒక్కక్షణం యిదంతా కలగా ఐపోయి, తను మడతమంచంమీద నిద్రలేస్తే ఎంత బాగుండు ననిపించింది. హడావుడి సద్దుమణిగి, ఎవరిళ్ళలోకి వాళ్ళు వెళ్ళిపోయాక, చల్లగా తన గూటికి చేరవచ్చునన్న ఆశ మదిలో మెదులుతూండగా, సంకేతస్థలం వద్ద ప్రియునికోసం ఎదురుచూసే పడతిలా చీకటిలో నుంచున్నాడు రాంబాబు

* * *

దొంగలకోసం తాము డొంకల్లో గాలించిన విషయాన్ని మరింత రసవత్తరంగా, అక్కడజేరిన ఆడవాళ్ళకి చెపుతున్న ప్రభాకరానికి మధ్యమధ్య అడ్డొస్తూ తను కూడా అందులో దూరడానికి విశ్వప్రయత్నం చేస్తున్నాడు సుబ్బరాయశాస్త్రి. ఏదైనా ప్రత్యేకమైన సంఘటన జరిగినపుడు అందులో తమ పాత్ర ప్రస్ఫుటంగా కనిపించాలనే యిగో వున్న చాలామంది లాంటివాళ్ళే వారుగూడా.

"బాత్ రూం కెడదామని బయటికొచ్చా నాంటీ, చీకట్లో మూర్తిగారింటి కిటికీ దగ్గర ఎవరో నుంచున్నట్టుగా అనిపించింది. నన్నుచూసి పరిగెత్తబోయాడు. ఇంతలో నే విసిరిన రాయి వాడికాలికి తగిలింది......" అమాయకంగా చెంపన చెయ్యిపెట్టుకుని వింటున్న జగదాంబగారికి చెపుతున్నట్టుగా వుంటుంది చూసేవాళ్ళకి. కానీ అతని స్వరం మాత్రం కొద్దిదూరంలో నుంచుని యిటే చూస్తున్న వాళ్ళమ్మాయి చెవుల్లో దూరడానికి నానాతంటాలూపడుతోంది "అసలు మొత్తం నలుగురొచ్చారు. ముగ్గురేమో మూర్తిగారింటి బాత్‌రూం వెంటిలేటర్‌లోంచి లోపలికెళ్ళార్ట అలికిడి విని నిద్రలేచిన ఆయన్ని కత్తితో బెదిరించి బ్యాంక్ తాళాలు యిమ్మని అడిగార్ట ఈలోగా పక్క గదిలో నిద్రపోతున్న వాళ్ళ తమ్ముడు సుందరం లేచి, పరిస్థితి అర్థంచేసుకుని, వాకిట్లోకి పరిగెత్తి అరిచాట్ట. దాంతో ఖంగారుపడి ముగ్గురూ వెనకవైపు గోడదూకి పారిపోయారు. ఒకడు మాత్రం రాంబాబుగారి దొడ్లోకి దూకాట్ట. వెంటపడ్డాం. కానీ వాడూ దొరకలేదు. కొద్దిలో తప్పించుకున్నాడు....." జరిగిందంతా చెపుతూంటే, ఆసక్తిగా అక్కడ గుంపుగా చేరారు పెద్దలంతా. "గారెంటీగా వాళ్ళు బ్యాంకు రాబరీకే వచ్చుంటారు. ఎందుకంటే యింట్లో సామానుకానీ, డబ్బుకానీ ముట్టుకోలేదు" తేల్చి చెప్పేశాడు శంకర్రావు. "మరో మొన్న వారాసిగూడాలో అట్లాగే జరిగిందట. బ్యాంక్ మేనేజరింటికి నలుగురూ, కాషియరు యింటికి నలుగురూ వెళ్ళేది, రెండు తాళంచెవులూ తెచ్చి, బ్యాంక్ దోచుకునేదీ చాలా యీజీ అయిపోతోంది వాళ్ళకి' రెండుచేతుల్నీ గట్టిగా రుద్దుకుంటూ అన్నాడు నరసింహం. సాధారణంగా అటువంటి బాతాఖానీలకు రాంబాబు ఎక్కువగా వెళ్ళడం అలవాటులేకపోవడంతో అతను లేకపోవడాన్ని ఎవరూ గమనించలేదు

"ఓసారిలాగే, ఫార్టీ సెవెన్‌లో అనుకుంటాను.... అమలాపురంలో నేను చదువుకునే రోజుల్లో....." అంటూ హిస్టరీ ఎత్తుకోబోతున్న అప్పారావు దృష్టి తమమీద పడకుండా మెల్లమెల్లగా అక్కడినుంచి తప్పుకుని యిళ్ళవైపు కదలసాగారు ఒక రిద్దరు దూరదృష్టికలవారు. అంతలో టైమెంతైందని అడిగా రెవరో. చెవిలో తిప్పుతున్న కాశీకను చటుక్కున కిందపడేసి, చెయ్యి పైకెత్తి తీక్షణంగా వాచీ వంక చూశాడు ప్రభాకరం "నాలుగూ యిరవైఐదు" చెప్పి అప్యాయంగా లుంగీతో ఓసారి దాన్ని తుడుచుకున్నాడు. అతనా వాచీ కొని యింకా వారం దాటలేదు. అందుకనే నిద్రపోతూ గూడా పెట్టుకొని పడుకుంటాడు.

"అబ్బో! తెల్లారిపోయిందన్నమాట. నేనింకా ఏ, మూడో అయ్యుంటుంది, పోయి పడుకుందామను కుంటున్నా. ఇంకో పావుగంటలో పాల వ్యాను వచ్చేస్తుం దెలాగూ." లుంగీ పైకిలేపుకుని కట్టుకుంటూ అన్నాడు శంకర్రావు మెల్లమెల్లగా ముసుగులోకి దూరుతున్న పిల్లల్ని "రోజూ ఎలాగూ లేచేడవరు. ఈ రూపేణా లేచారుగా, ఇవాళ్ళన్నా పుస్తకాలు తీసుకుని చదవండి. తెల్లవారుజామున చదివితేనే బుర్రలో కెక్కుతాయి. పైగా పరీక్షలు గూడా దగ్గరకొస్తున్నాయి" గదమాయించాడు సుబ్బరాయశాస్త్రి. గోడపక్కనే వున్న లైటుస్థంభాన్ని అప్పుడే తడిపి పైకిలేస్తున్న శంకర్రావు "రోజూ యిలాగే దొంగలొస్తుంటే బాగుణ్ణు, వీళ్ళకి చీకటితో లేవటమన్నా అలవాటవుతుంది" అని కిసుక్కున నవ్వి చుట్టూ చూశాడు. ఎవరూ తన జోకని కాచ్ చెయ్యలేదని గ్రహించగానే సమయస్ఫూర్తిగా మరో టాపిక్‌లోకి మాట మార్చాడు చాలామందిలాగే

అప్పటికే లంగాలు పైకి ఎగదోపుకుని, ఓణీలు




బిగించి కట్టుకుని, లెక్కపెట్టుకుంటూ ముగ్గుతో చుక్కలు పెట్టేస్తున్నారు ఆడపిల్లలు "పిన్నిగారూ! కాస్త ముగ్గుంటే యిస్తారా? అనక్కి బాబిగాడిచేత తెప్పించి యిచ్చేస్తా" తన దినచర్య ప్రారంభించేసిం దో యిల్లాలు. "ఇవాళ మేం సీతాకోక చిలుకల ముగ్గేస్తున్నామని ఒక రంటే, మాది పిట్టల ముగ్గు మరీ పెద్ద ముగ్గులే. సర్లేకానీ నా దగ్గర పసుపురంగైపోయింది కాస్త ఇస్తావా? కావాలంటే నా దగ్గర ఆరెంజీ వుంది తీసుకో" ఎక్కడా కనపడని మ్యూచువల్ కోఆపరేషన్ అక్కడ తాండవిస్తోంది

* * *

ఒక్కసారి ఉలిక్కిపడి పైకి చూశాడు రాంబాబు. రాత్రంతా మినుకుమినుకు మంటూ బ్రతికిన నక్షత్రాలు, సూర్యుడి ఆగమన ఛాయలు ముందుగనే పసిగట్టి, అతనిముందు తమ ఉనికి వెలవెల బోవడం యిష్టంలేక, ముభావంగా తెరమరుగవు తున్నాయి. ఎక్కడో దూరంగా ఒకటి రెండు కాకులు

వుండివుండి అరుస్తున్నాయి కొద్దిసేపట్లో తెల్లవారబోతోందన్న నిజం అర్థమైన మరుక్షణంనించి రాంబాబు వెన్నులో వణుకు ప్రారంభమైంది అప్రయత్నంగా రెండుచేతుల్నీ జోడించి భగవంతుడా! దయచేసి నన్ను రక్షించు నన్ను కాపాడు నీకు కొబ్బరికా కాదుకాదు అభిషేకం. చేయిస్తాను ఎలాగోలా ఈ ఆపదనించి నన్ను గట్టెక్కించు నీకు పుణ్యముంటుంది ఏ వంటున్నాడో కూడా తెలీకుండా, ఏవేటేవిటో గొణుక్కుంటున్నాడు అస్పష్టంగా అంతకు ముందెప్పుడో దేముడున్నాడా? ఏడీ నాకు కనిపించమను అంటూ చేసిన చాలెంజీలు గుర్తొచ్చికాబోలు రెండు చెంపలూ గట్టిగా వాయించుకున్నాడు కసిగా ఆకాశంలోంచి ఏదైనా అంగోస్త్రం ఎగిరివచ్చి తనమీద పడితే బావుణ్ణునుంది విఠలాచార్య సినిమాలోలా మరోసారి వీధిలోకి తొంగిచూశాడు ముచ్చటగా ముగ్గులు పెడుతున్న అతివలమధ్యనించి వేగంగా పరిగెత్తుకునివెళ్ళి తన యింట్లోపడితే' అని ఒక్కక్షణం ఆలోచించి తరువాత అదెంత ప్రమాదకరమైన ఆలోచనో గ్రహించి విరమించుకున్నాడు దూరంగా మైన్ రోడ్డు మీద పాల వేన్ వస్తున్న శబ్దం. అది నిజమో, తన ఆలాపనో అర్థమై చావడంలేదు. ఏదేమైనా కొద్దిసేపటిలో తాను నగ్నంగా ఎవరో ఒకరి కంటపడటం ఖాయం ఆ ఆలోచన రాంగానే రాంబాబు మెదడు మొద్దుబారినట్లయింది కనుకొనలను దాటడానికి విశ్వప్రయత్నం చేస్తున్నాయి వెచ్చని కన్నీళ్ళు గట్టిగా గొంతుచించుకు అరవాలనీ, ఊడి చేతిలోకొచ్చేలా జుట్టుపీక్కోవలనీ, తలక్రిందులుగా శీర్షాసనం వేయాలనీ, శరీరమంతా ఒక్కసారిగా ఉంగచుట్టుకుపోయి, భూమిలోకి దిగబడిపోవాలనీ..... యిలా ఏదో ఏదో అయిపోవాలనీ అర్థంకాని, అగమ్యగోచరంగా ఆలోచనలు . ఇక అక్కడ నుంచుని ప్రయోజనం లేదన్నట్లుగా, మెల్లగా మైన్‌రోడ్‌వైపుకి నడవసాగాడు.

దూరంగా రైలుకట్ట వెనకనుండి ఉదయభానుడి తొలి కిరణాల వెలుగు తాలూకు ఛాయలు అస్పష్టంగా కనిపిస్తున్నాయి. మట్టిరోడ్డును దాటి, తారు రోడ్డుమీదకొచ్చి నిలబడ్డాడు రాంబాబు. పగలంతా.రణగొణ ధ్వనులతో అలసిపోయిన ఆ ప్రదేశం నిశ్శబ్దంగా నిద్రపోతోంది. మూసివున్న కిళ్ళీకొట్టు కింద నిద్రపోతున్న కుక్కపిల్ల రాంబాబు అడుగుల చప్పుడికి నిరసనగా ఓ అరుపు అరిచి, నీరసంగా ముడుచుకు పడుకుంది.' రోడ్డుపక్కగా కొత్తగా కట్టిన షాపులు వున్నాయి. 'ఇందిరా ఫ్యాన్సీస్టోర్స్..... పక్కనే 'మాధవీ' క్లాత్ షోరూం అన్న అక్షరాలు చదువుకుని చిన్నగా, నవ్వుకున్నాడు రాంబాబు. ఆ షాపు లోపల అచేతనంగా పడివున్న తానులకొద్దీ బట్టలు, బయట జానెడు గుడ్డముక్క కోసం నగ్నంగా దేవుళ్ళాడుతున్న మనిషి.. ఆలోచిస్తూ నడుస్తున్న రాంబాబు కాళ్ళు సడన్ బ్రేకుతో ఆగిపోయాయి

ఆపకుండా ఖళ్ళుఖళ్ళుమని దగ్గుతూ, ముసుగులో అసహనంగా కదులుతున్న భైరాగి పైన కప్పుకున్న దుప్పటి అని పిలవబడే ముతక గుడ్డను పక్కకితీసి, బద్ధకంగా ఆవులించి, లేచి కూర్చున్నాడు రాగి రంగులో అట్టలుకట్టి అసహ్యంగా కనిపించే జుట్టు, నో రెక్కడుందో కనిపించకుండా గుబురుగా పెరిగిన గడ్డం, ఎక్స్‌-రేతో పనిలేకుండా ఏ ఎముకెక్కడుందో స్పష్టంగా కనిపించే మురికిపట్టిన శరీరం, మొలకో మాసిపోయిన కాషాయగుడ్డ, భుజంమీద ఏమహానుభావుడో దానంచేసిన బొక్కలుపడ్డ గళ్ళ దుప్పటి యివన్నీ భైరాగిగాడి బయోడేటా వివరాలు గుంటలుపడ్డ కళ్ళతో, దొంగచూపులు చూస్తూ బస్టాపులదగ్గర అడుక్కోవడం వాడి దినచర్య



ఊరంతా వాడిదే అందుచేత వా డా సమయంలో అక్కడ కనిపించడం రాంబాబుకు ఆశ్చర్యమేమీ అనిపించలేదు కానీ, ఒక్కక్షణం క్రితం తన మదిలో మెరిసిన మెరుపుతాలూకు కాంతిరేఖలు, అప్పటివరకూ నిస్తేజంగా వున్న కళ్ళలో ప్రతిస్పందించాయి·

మెల్లగా వాడిదగ్గరకు నడిచి మెట్లమీద మోకాళ్ళు ఆన్చి, కూర్చున్నాడు రాంబాబు. "చూడుబాబూ! నాకో చిన్న సాయం జేస్తావా?" అని ఒక్కక్షణం ఆగాడు. ఆకులు నాకేవాడు తన చేతులు నాకేవాణ్ణి చూసినట్టుగా తనకేసి చూస్తున్న భైరాగోడికి ఎలా చెప్పాలో తోచక కాస్త తటపటాయించి "ఏంలేదు.. .. నీ దుప్పటి నాకిస్తావా ... కాస్త.... పుణ్యముంటుంది" ఎందుకో తన గొంతు తనకే వింతగా వినిపించింది రాంబాబుకి "ఎల్డెల్డు....." అని యింకేదో అనబోతున్న వాడి చూపులు తన శరీరంమీద ఎక్కడో నిలిచిపోయి తీక్షణంగా చూస్తున్నాయి ఒక్కక్షణం తరువాత గ్రహించాడు మసకవెలుతురులో మెరుస్తూ కనిపించిన తన చిటికినవేలి బంగారు ఉంగరాన్ని విషయం అర్థంకాక అయోమయంగా చూస్తున్న వాడి కళ్ళకి కనిపించేటట్టుగా ఉంగరాన్ని తీసిపట్టుకుని "కావాలంటే యిది యిస్తాను నిజంగా బంగా రందే నామీదొట్టు నీ దుప్పటిచ్చెయ్ .' ఏమిటేమిటో మాట్లాడుతున్నాడు పొంతన లేకుండా మరి నిజంగా అది బంగారందే అని నమ్మాడో, లేక తళుక్కుమని మెరిసిన దానిలోని తెల్లరాయి నచ్చిందో కానీ, మెల్లగా ఒంటికి చుట్టుకున్న దుప్పటి తీసి కిందపడేస్తూ, రాంబాబు చేతిలోని ఉంగరాన్ని గుంజుకున్నాడు ఆత్రంగా. ఎలిక చచ్చిన కంపుకొడుతున్న దుప్పటిని చటుక్కున చేతుల్లోకి తీసుకుని వేగంగా యివతలికి వచ్చేశాడు రాంబాబు మరో క్షణానికి వాడి బుద్ధి మారిపోయి దాన్ని లాక్కుంటా డేమోనన్న అనుమానంతో

అప్పటివరకూ నగ్నంగా తిరగడం అలవాటైన శరీరానికి దుప్పటి కప్పేసరికి ఒక్కసారిగా ఎక్కడలేని సిగ్గు ముంచుకు వచ్చేసి, రోమాలు నిక్కబొడుచుకున్నాయి. మెడదగ్గరనించి మోకాళ్ళదాకా చుట్టగా కప్పుకుని తారురోడ్డు దిగుతుండగా చూశాడు దూరంగా వస్తున్న పాలవేను హెడ్‌లైట్ కాంతిని

* * *

'ఏంటి గురూగారూ! పొద్దున్నే మార్నింగ్ వాక్ కెళ్ళొస్తున్నారా?' పాలపాకెట్లకోసం వెడుతున్న సుబ్బరాయశాస్త్రి పలకరించాడు వడివడిగా కాలనీవైపు నడుస్తున్న రాంబాబుని "ఆఁ ఆఁ మరేఁ . అబ్బ! ఈ చలిలో చచ్చిపోతున్నామనుకోండీ లోపల చొక్కా, స్వెట్టరు వేసుకొని పైన ఈ దుప్పటి కప్పుకున్నాగూడా చలాగిచావడంలా. ' తను అనవసరంగా ఎక్కువగా మాట్లాడుతున్నానని గ్రహించి, చిన్నగా నాలిక కొరుక్కున్నాడు దాదాపు తెల్లవారిపోతుండగా రంగురంగుల ముగ్గుల మధ్యనించి జాగ్రత్తగా నడుస్తూ వెళ్ళి, తన యింటి కాంపౌండ్‌లోకి అడుగుపెట్టాడు యుద్ధభూమి నుంచి చావుతప్పి కన్ను లొట్టబోయి, తిరిగొచ్చిన మహారాజులా. మంచుపడి చల్లగా తడిసిన దిండుకిందనించి తాళంచెవి తీసుకుంటుంటే కనిపించింది మడత మంచం పక్కనే కుప్పగా పడివున్న నీలంరంగు లుంగీ. కసిగా దాన్ని ఒక్క తన్నుతన్ని లోపలికి నడిచాడు.

అరగంటక్రితం తన మానాన్ని కాపాడిన దుప్పటిని కర్రతో ఎత్తి గోడవతల చెత్తకుండీలోకి విసిరేసి, స్నానంచైడానికి బాత్‌రూంలోకి దూరాడు రాంబాబు. అప్పటి కెన్నిసార్లు స్నానం చేశాడో గుర్తులేదుగానీ, కొత్త షాంపు సీసా దాదాపు సగానికి ఖాళీ అయిపోయింది. అప్పటివరకూ తను అనుభవించిన టెన్షన్, మానసిక క్షోభ యిప్పుడు తల్చుకొంటే

## ప్రశ్నావళి
### -కె. రామలక్ష్మి

**డి. ఆర్. ఆర్. విశాఖపట్నం**

ధనవంతులెప్పుడు సంతోషవంతులే కాదన కలరా?

● ధనమైనా సంతోషమైనా– అనుభవించాలంటే దాన్ని స్వయంగా సృష్టించి వుండాలి సంపాదించని డబ్బు, తాము సృష్టించని సంతోషం– అనుభవించే అర్హత వుండదు

మనిషి నిలకడగా వుండాలంటే?

● తనపై తను ఆధారపడ్డమే! ఏదీ తనని బలహీన పరచలేదన్న నమ్మకం! తన తప్పులు తన నుండే దిద్దుకోకలనన్న విశ్వాసం వుంటే– నిలకడగా వుండవచ్చు ఎవరి పైన ఆధారపడ్డా– ఆధారం తొలగితే సాగిలపడవచ్చు తనే తనకు దాపు అయితే– ఆ బెంగ వుండదు!

**ఎమ్. కె. కాకినాడ**

ప్రేమికులు ఎందుకు విడిపోతూంటారు?

● అతి ప్రేమ అలసత్వానికి దోహదం చేస్తుందన్న– సంగతి వినలేదా సోదరీ?!

**సి. హెచ్. ఎన్. ఆర్. సత్తెనపల్లి**

పాఠకులు ఒక ప్రశ్న ఆలోచించడానికి కొంత కాలం పడుతుంది మరి మీరు సమాధానం యివ్వడానికి?

● అది చదవడానికి పట్టినంత సమయం చాలు!

పతనమౌతూన్న హిందూ మతాన్ని ఉద్ధరించడానికి కొందరు ప్రయత్నిస్తున్నారు ఇది చాలా శుభ సూచకం కదా?

● ఎవరికి?!

ఇతర శీర్షికలలో ప్రశ్నలు పంపిన వారికి– ఇతర విధాల ప్రోత్సాహం వుంటుంది మీ శీర్షికలో అవి ఎందుకు ప్రవేశపెట్టరు?

● నా ప్రశ్నావళిలో ఏది ఉత్తమ ప్రశ్న? అని ఎవరు నిర్ణయించాలి? నేనా? సంపాదకులా? పరితలా? అలాంటి పిచ్చి సరదా నాకు లేదు బహుమతి లేకుంటే– ప్రశ్నలు రావా? వేయరా?!

మెదడుని ఉపయోగించే రచయితలు మంచి ఊహలు వచ్చుటకు ఏమైన పదార్థాలు తీసుకొంటారా?

● ఘనమా? ద్రవమా? మీరడిగేది? రెండూ దండగే– ఒకటి శరీరాన్ని ఇంకోటి మెదడునీ ఫూల్ చేసి వదులుతుంది

**కె. పి. నెల్లూరు**

★ స్త్రీ స్వరూపం వర్ణిస్తారా?

● ఎవరి కళ్లతో చూసి?!

**ఎల్. ఎస్. ఆర్. ఎమ్. కోటబొమ్మాళి**

★ మనోవ్యాధికి మందు లేదు అంటారు మరి మనోవ్యాధి లేకుండా వుండాలంటే ఏమి చెయ్యాలి?

● మనసుని చంపుకొని బ్రతకాలి

**కె. ఎన్. గూడూరు**

★ ఆనాటి చెలి మనోభావాలు చిత్ర రూపంలో తెలిపే వారు నేడు?

● ఊరెగిరిపోయే వాద్య సంగీత నేపథ్యంలో కోడై కూస్తూంది- నేటి చెలి మన చిత్రరంగంలో -

**జి. ఎన్. కొమరపూడి**

★ ప్రేమించడం ఎలాగో కొంచెం చెప్తారా?

● గురువులు నేర్పలేని విద్య ఇదొక్కటే- అందుకే వ్యక్తుల అభిరుచుల/ అభిమతాలకి దర్పణంగా వెల్లుతూంటుంది వారి ప్రేమ ●

---

ఆదో రకమైన థ్రిల్లింగ్‌గానూ, మాటల్లో చెప్పలేని వింత అనుభవంగానూ వుంది అనుభూతి పంచుకోవడానికి అర్ధాంగి యింట్లో లేకపోవడంతో, ఎలాగో అలా స్వయంపాకం తిన్నాననిపించి ఆఫీసుకు బయలుదేరారు.

బ్రౌన్ కలర్ షూ క్రింద మెత్తగా నలుగుతున్న గడ్డిపరకలు కిసుక్కున నవ్వుతున్నాయి. కొద్ది గంటలక్రితం పిచ్చెక్కినవాడిలా, తడుముకుంటూ తిరిగిన ఖాళీస్థలాల మధ్యనుంచే రోజులాగే హడావిడిగా నడుచుకుంటూ మెయిన్‌రోడ్డుకు చేరుకున్నారు రాంబాబు.

నీడగావున్న షెల్టర్‌కిందకి అడుగులు వేస్తూ చిన్నగా ఉలిక్కిపడ్డారు. కొద్దిదూరంలో మట్టిలో దొర్లుతున్నాడు బైరాగి అంతకుముందు తగిలిన బూటుకాలి దెబ్బకి కాబోలు కడుపు పట్టుకుని అరుస్తున్నాడు "ఉంగరం మెక్కడినుంచి దొబ్బుకొచ్చావురా, .. దొంగలం... కొడకా....' లాఠీ కర్రతో డొక్కలో పొడుస్తూ అడుగుతున్నాడు టీటుకానిస్టేబుల్ ఆంజనేయులు. తొలిచూపులోనే, అది బంగారందని కనిపెట్టి, తన సుడికి మురిసిపోతున్నాడు గుంభనంగా. పరిస్థితిని మెల్లమెల్లగా అర్థంచేసుకున్న రాంబాబు గుండె ఒక్కసారి బాధగా మూలిగింది. తన పెళ్ళికి మావగారు పెట్టిన ఉంగరం. ఎంతలేదన్నా మూడు



వేలన్నా వుంటుంది ఖరీదు "ఛ ఛ ముందూ వెనకా చూసుకోకుండా ఓ దరిద్రపుగొట్టుకి ధారపోశాడు తను. నిన్నటిదాకా తన చిటికిన వేలిన తళుక్కుమని మెరిసేది. ఇవాళ మురికిపట్టిన చేతిలో కళావిహీనంగా వుంది. అంతేకాదు, రేప్పొద్దున ఆంజనేయులి పెళ్లాం వేలిని చేరినా ఆశ్చర్యంలేదు.

దగ్గరకెళ్ళి కల్పించుకుంటే బైరాగి తనని గుర్తుపట్టి పంచాంగం విప్పుతాడేమోనన్న శంక ఓ పక్క లాగుతున్నా, రాంబాబుకి ఆంజనేయులుతో కాస్త పరిచయం వుండడంతో మెల్లగా అటువైపుకి నడిచాడు.

అప్పటికే ఉంగరం తీసి ఎర్రరంగు బూటుకాళ్ళదగ్గర పడేసి బ్రతుకుజీవుడా అని పరుగు లంకించుకున్న బైరాగిని ఆపి "వాడు దొంగకాదు, వాడికి దాన్ని నేనే యిచ్చాను" అని చెప్పాలని ఒక్కక్షణం అనిపించినా, ఆ తరువాత తన్నే పిచ్చివాడికింద జమకడతారని వూరుకున్నాడు

కిందనించి ఉంగరాన్ని తీసి దుమ్ము దులుపుతూ చూశారు పక్కనే నిలబడ్డ రాంబాబుని "ఏంటిసార్ యిది మీదేనా?" అని అడిగారు, కాదనాలని వెయ్యిదేముళ్ళకు మొక్కుకుంటూ

"హరె..... యిదిక్కడికెలా వచ్చింది? పొద్దునించీ దీనికోసం వెతకని చోటులేదు పొద్దున్నే పాలకోసం వచ్చినపుడు జారిపోయినట్టుంది బుజ్జిముండ చూశావా – కష్టార్జిత మంటే యిదేనోయ్..... యివాళ లేచినవేళ మంచిది...." అంటూ తనెంత సహజంగా నటించగలనా అని అబ్బురపడి పోతున్నాడు రాంబాబు. "థాంక్స్రోయ్ నువ్వుకాబట్టి సరిపోయింది, డ్యూటీలో మరింకే వెధవలన్నా వుండుంటే స్టేషన్ చుట్టూ తిరగాల్సొచ్చేది ఈ వెధవ ఉంగరంకోసం" అంటూ సున్నితంగా అతని చేతుల్లోంచి దాన్ని తీసుకొని, ఏడవలేక నవ్వుతున్న ఆంజనేయులికి కానుకగా ఓ చిరునవ్వు నవ్వి యివతలికి వచ్చేశారు. □